PLEASE DO NOT JOIN SOLVE ACADEMY!!!
FOR COMPETITIVE EXAMS COACHING
IF_YOU ARE NOT SERIOUS _IN PREPARATION!!!
COURSES:
SSC/RRB/BANK/POLICE
BATCH STARTED IN SRIKAKULAM
CALL US AT
7569089825/8688172010

శ్రీశ్రీశ్రీ సంజీవరాయస్వామి ఆలయం
సఖియా మఠం, బాయమ్మతోట, చిన బొందిలీపురం, శ్రీకాకుళం
ఆహ్వానం
తేది 31-08-2024 శనివారం
శనిత్రయోదశి
ఈ ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించబడిన జిల్లాలోనే అరుదైన 3 అడుగులు ఎత్తుగల శ్రీశనైశ్చర విగ్రహానికి మీ స్వహస్తాలతో ద్వితీయ తైలాభిషేకం
(ఉదయం : 5 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు)
చేయుటకు తరలిరండి. దర్శించి తరించండి.
- ఆలయ ధర్మకర్త.
- విశ్వజయము గ్రూప్ భక్త బృందం సౌజన్యంతో
సెల్ : 92466 31755

అడ్మిషన్లు జరుగుచున్నవి
రవాణా సదుపాయం కలదు
డాక్టర్ దండి సూర్యనారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి
శ్రీ శ్రద్ధ ప్లేస్కూల్
A/C
(LKG to 5th Class)
Right Place for Right Education
కామేశ్వరి కళ్యాణమండపం దగ్గర, నందల జంక్షన్, నక్కవీధి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, శ్రీకాకుళం. 99893 03703

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 28-8-2024
సంపుటి: 20 సంచిక: 133
పేజీలు: 4 వెల: రూ.1







## చెత్తను ఎత్తలేక చేతులెత్తేస్తున్నారు!

### చెత్తేర్.. చెదారేర్..

- ఒక్కో మున్సిపాలిటీలో రోజుకు వందల మెట్రిక్ టన్నుల చెత్త
- కొన్ని రాష్ట్రాల్లో కొండల్లా పేరుకుపోతున్న చెత్త
- చెత్తను మేనేజ్ చేయలేక బెంబేలెత్తిపోతున్న స్థానిక సంస్థలు
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్

దుప్పల రవికుమార్



డిసెంబర్ 2023లో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ తనకు తానుగా దేశంలోని అన్ని స్థానిక సంస్థల యాజమాన్యాలకు దీనికి సంబంధించిన ఒక విపులమైన సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం ఈ ఏడాది హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల్లో గురుగ్రాం, ఫరీదాబాద్ మున్సిపల్ కమిషనర్లను పిలిపించి ఆరావళి పర్వత శ్రేణుల నడుమ బంద్వారీ పర్వతాల నడుమనున్న మైదాన ప్రాంతంలో వద్దని చెప్తున్నా ఎందుకు చెత్త పారేస్తున్నారని ప్రశ్నించింది. ఇదివరకు పోగుపడిన చెత్తను పూర్తిగా పోనివ్వకుండానే, దానిపై ఏవిధమైన చర్యలు చేపట్టకుండానే ఇప్పుడు కొత్తగా అక్కడ చెత్త పారేయడం ఏమిటని గట్టిగా నిలదీసింది. కానీ ఈ రెండు పట్టణ మున్సిపాలిటీలు దీనికి సంబంధించి ఏ విధమైన సమాధానం ఇవ్వలేకపోయాయి. ఇదే ప్రశ్న దేశంలోని ఏ మున్సిపాలిటీని లేదా మున్సిపల్ కార్పొరేషన్‌ను అడిగినా నిలువుగుడ్లు వేసుకు చూస్తున్నాయే తప్ప, సమాధానం మాత్రం లేదు. ఎందుకంటే మన దేశంలో దీనికి సంబంధించిన విధివిధానాలే ఖరారు కాలేదు. ఏటికేడాది ఇలా పోగుచేస్తున్న డంప్ యార్డుల్లో రకరకాల రసాయనాలు వెలువడుతున్నాయని ఎన్జీటీ - మిగతా 3లో

మన ఇంట్లో కూరగాయలు తరుగుతాం కదా, వచ్చిన చెత్తను ఏం చేస్తాం? వీధిలో పడేస్తాం. భోజనాలు కానిచ్చాక మిగిలిన చెత్తను ఏం చేస్తాం? అది కూడా వీధిలోకే. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంటిలోనే ప్రతిరోజుకు కేజీకి పైన చెత్త వీధుల్లోకి చేరితే, ఆ రోజంతా వీధిలోకి వచ్చిన వందల కేజీల చెత్త ఏమవుతుంది? టన్నుల కొద్దీ చెత్తను మరుసటి రోజు ఉదయమే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, లేదా కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు ట్రాక్టరు తీసుకొచ్చి ఎత్తుకుపోతారు. అలా ఊర్లో పోగైన రెండు మూడు ట్రాక్టర్ల చెత్తను ఆ రోజు మధ్యాహ్నానికి ఏం చేస్తారు? తిన్నగా ఊరవతలకు తీసుకువెళ్లి డంప్ యార్డులో పడేస్తారు. అలాంటిది పెద్ద పెద్ద పట్టణాల్లో రోజుకి ఎంత చెత్త పోగు పడుతుంది? ఇప్పుడు మనం వేసిన లెక్క కేవలం గృహ వినియోగంలో పోగుపడింది. మరి పారిశ్రామిక ప్రాంతాల్లో, వాణిజ్యపరమైన వినియోగంలో విడుదలవుతున్న చెత్త అంతా అదే డంప్ యార్డులకు చేరుతోంది. ఇప్పడది కొండలుగా మారి చాలా మున్సిపాలిటీల్లో మనుషులకు తీవ్రమైన ముప్పు కలిగించే ప్రాణాంతకంగా మారుతోంది. దీనిని ఏవిధంగా మేనేజ్ చేయాలో తెలియక అధికార యంత్రాంగం తలలు పట్టుకుంటున్నాయి. గోరుచుట్టు మీద రోకటిపోటులా ఇప్పుడు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఈ ప్రాణాంతకమైన పరిణామం గురించి సుప్రీంకోర్టును ఆశ్రయించింది.




## మహారాష్ట్ర పోలీస్ శాఖలో వండర్..
# ఏఐ మార్వెల్!

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇప్పుడు ఫలానా రంగమంటూ పరిమితం కాకుండా శాసిస్తోంది. దీనివల్ల ఉన్న ఉపయోగాలతో పాటే, ప్రమాదాలూ చర్చకు పెడుతోంది. అయితే, సరికొత్త సాంకేతిక విప్లవాన్ని అనుకూలంగా మల్చుకోవడంతోనే విజయాల్ని ముద్దాడవచ్చు. ఇప్పుడా పనిలో సక్సెస్ అయింది మహారాష్ట్ర పోలీస్. దేశంలోనే నేరాల పరిశోధనకు మొట్ట మొదటగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థవంతంగా ఉపయోగిస్తున్న పోలీస్ వ్యవస్థగా మహారాష్ట్ర పోలీస్ సాధిస్తున్న ఆ విజయం గురించి ఒక్కసారి కాస్త తెలుసుకుందాం.

ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలు తమ యుద్ధ వ్యవస్థలను హెల్మెట్ మౌంటెడ్ రాడార్స్, రిస్ట్ వాచ్ మౌంటెడ్ స్క్రీన్ డిస్‌ప్లేస్.. ధ్వని వేగానికి మించిన 20 రెట్ల వేగాన్ని కల్గిన మిస్సైల్స్.. రోబోటిక్ సైనికులు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌తో ఎప్పుడు ఏ యుద్ధం వచ్చినా సై అనే స్థాయిలో సన్నద్ధమయ్యాయి. ఇక దక్షిణ కొరియా వంటి దేశాలైతే ఏకంగా తమ దేశ భద్రత దృష్ట్యా బార్డర్స్‌పై రోబోటిక్ సైనికులతోనే కాపలా కాయిస్తున్నాయి. ఈ క్రమంలో ఆర్టిఫిషియల్ వంటి ఆధునిక సాంకేతికతను ఆయా రంగాలకు అనుకూలంగా మల్చుకోలేకపోతే కచ్చితంగా మనం వెనుకబడ్డట్టే. ఇదే విషయాన్ని మహారాష్ట్ర పోలీస్ స్ఫూర్తిగా తీసుకుంది. ఏఐతో నేరాలను ఛేదించేందుకు శ్రీకారం చుట్టింది.

- రమణ కొంటికర్ల

మహారాష్ట్ర రీసెర్చ్ అండ్ విజిలెన్స్ ఫర్ ఎన్‌హేన్స్‌డ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ షార్ట్‌ఫామ్ మార్వెల్. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా నేర పరిశోధనకు సంబంధించి ఈ మార్వెల్ అనే సంస్థ.. మహారాష్ట్ర పోలీస్ బలగాలకు తగిన సాయం అందించడం, పరిష్కారాలు చూపడంలో ఇప్పుడో ఓ అద్భుతం.

మనకు తెలుసు రావెన్ సెంట్రీ అనే అమెరికన్ ఏఐ టూల్ ఆఫ్ఘనిస్తాన్‌లో ముందే తాలిబన్ దాడులను ఎలా అంచనా వేయగల్గిందో! ఇప్పుడు 70 శాతం కచ్చితత్వాన్ని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాధిస్తున్నట్టుగా ఎకనామిస్ట్ నివేదికలు కూడా పేర్కొంటున్నాయి. దీంతో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు, మిల్ట్రీ వింగ్స్ ఇలా అందరూ ఏఐపై దృష్టి పెట్టలేకుండా ఉండే అనివార్య పరిస్థితిని ఈ ఇంటలిజెన్స్ వ్యవస్థ కల్పించింది.

ఈ క్రమంలోనే మహారాష్ట్ర తన పోలీస్ వ్యవస్థను మరింత పటిష్ఠంగా మార్చేందుకు 2024, మార్చిలో ఒక త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. మహారాష్ట్ర ప్రభుత్వం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, నాగ్‌పూర్, పినాకా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఈ ఎంవోయూలో భాగంగా ఈ మార్వెల్ అనే స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ని ఏర్పాటుచేశారు.

తప్పిపోయిన వ్యక్తులు, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్స్, దొంగతనాలు, హత్య, హత్యాచారాలు, సైబర్‌నేరాలు, ఇతర వ్యవస్థీకృత నేరాల శోధనలో ఈ ఏఐది కీలకపాత్ర కాబోతున్నట్టు మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుజాత సౌనిక్ చెప్పే మాట. అయితే, ఏఐ కేసులను ఏవిధంగా డీల్ చేయబోతోందన్నదీ ఆసక్తికరమే! ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్.. అలాగే, రోబోటిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నకొద్దీ.. రాబోయే రోజుల్లో మానవ వనరులకు ఉపాధి కష్టమేనన్న ఒక ప్రచారాన్ని మనం తరచూ వింటున్నాం. అయితే, అన్ని సందర్భాల్లో ఇదెంతమాత్రం నిజం కాదు. తమ మానవ వనరుల పరిశోధనను సులభతరం చేయడం కోసం మాత్రమే ఏఐ టూల్స్ తప్ప.. అన్ని రంగాల్లోనూ పూర్తిగా రీప్లేస్‌మెంట్ జరగడం గురించి ఇప్పుడప్పుడే భయపడాల్సిన అవసరం లేదనే వాదనా ఉంది.

పోలీసుల అపరాధ పరిశోధనలో భాగంగా ఎంతో డాటా వారి దగ్గరకు చేరుతుంది. అయితే, ఆ డాటాను జల్లెడ పట్టి.. ఫోకస్డ్‌గా మార్చే ప్రక్రియలో ఏఐ ఉపయోగం ఎంతో అంటున్నారు నాగపూర్ - మిగతా 3లో

• ఎడిటోరియల్

# మహిళలపై అకృత్యాల్లో మనది సెకండ్ ప్లేస్!

అవును.. చాలామంది నమ్మకపోవచ్చుగానీ.. ప్రముఖ సెర్చ్ ఇంజిన్ గూగుల్ ప్రపంచవ్యాప్తంగా మహిళలపై హింసాత్మక ఘటనలు అధికంగా జరిగే దేశాల జాబితాలో భారత్‌కు రెండోస్థానం ఇచ్చింది. దానికి తగినట్లే ఇటీవలి కాలంలో మనదేశంలో మహిళలపై దాడులు, లైంగిక నేరాలు, కిడ్నాప్‌లు, హత్యలు బాగా పెరిగిపోయాయి. కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ఆస్పత్రిలో నైట్‌డ్యూటీలో ఉన్న మహిళా జూనియర్ డాక్టర్‌ను కంచే చేను మేసినట్లు ఒక పోలీస్ వలంటీరే అర్ధరాత్రి హత్యాచారానికి పాల్పడిన ఘటన దేశంలో ఎంత సంచలనం సృష్టించిందో మనం చూస్తున్నాం. ఈ నెల తొమ్మిదో తేదీన ఈ దారుణం జరిగితే ఇంతవరకు ఒకే ఒక్క నిందితుడిని పట్టుకోగలిగారు. సీబీఐ రంగంలోకి దిగినా ఈ కేసులో అసలు ఏం జరిగింది? ఎవరు బాధ్యులు అన్నది ఇంకా నిర్ధారించలేకపోయారు. అంతకంటే దారుణం ఎప్పుడో 1992లో అజ్మీర్‌లో రాజకీయ ప్రాబల్యం ఉన్న ఓ ముఠా సుమారు 250 మంది స్కూల్, కళాశాల విద్యార్థినులను ట్రాప్ చేసి లైంగిక దాడులకు పాల్పడి, వాటిని ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన కేసులో 30 ఏళ్ల తర్వాత కూడా ఇప్పటివరకు బాధితులకు పూర్తి న్యాయం దక్కలేదు. ఆ కేసులో ఇప్పటికీ ఓ నిందితుడు పరారీలో ఉండగా, మరో నిందితుడిపై ఇంకా విచారణ కొనసాగుతోంది. అలాగే ఓ దిశ, ఓ నిర్భయ.. ఇలా మహిళలపై ఎన్నో అకృత్యాలు జరుగుతున్నా సకాలంలో నేరగాళ్లకు శిక్షలు పడకపోవడం, బాధితులకు న్యాయం అందకపోవడం వల్లే దేశంలో మహిళలపై నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. అయితే ఆ విషయంలో దేశం ఏకంగా ప్రపంచంలోనే రెండోస్థానానికి చేరడమే అత్యంత ఆందోళనకర అంశం. గూగుల్ అంచనా ప్రకారం మహిళలకు భద్రత లేని దేశాల్లో ప్రపంచంలో దక్షిణాఫ్రికా టాప్ ప్లేస్‌లో ఉంది. ఆ దేశంలో ఒంటరిగా బయటకు వెళ్లే మహిళలు సురక్షితంగా తిరిగి ఇంటికి చేరేవరకు గ్యారెంటీ ఉండదు. దాంతో దక్షిణాఫ్రికాలో మహిళలు ఒంటరిగా ప్రయాణాలు, వాహనాలు నడుపుతూ బయటకు వెళ్లడం, కనీసం సొంత ఊళ్లోనే రోడ్లపై ఒంటరిగా తిరగడం క్షేమకరం కాదని హెచ్చరికలు జారీ చేయాల్సిన దుస్థితి ఉందట. గూగుల్ మాత్రమే కాదు.. వరల్డ్ పాపులేషన్ రివ్యూ కూడా ప్రపంచంలోనే ఆడవారికి తగిన రక్షణ కల్పించలేని ప్రమాదకరమైన దేశంగా దక్షిణాఫ్రికాను పేర్కొంది. ఈ దేశానికి చెందిన 25 శాతం మహిళలు మాత్రమే తాము ఒంటరిగా బయటకు వెళ్లినా క్షేమంగా తిరిగి రాగలుగుతున్నామని చెప్పినట్లు మరో అధ్యయనం వెల్లడించింది. ఆ తర్వాత స్థానం భారతదేశానిదే. ఆసియాలో మహిళా భద్రత అతితక్కువగా ఉన్న దేశంగా భారత్ తరచూ మొదటి స్థానంలో నిలుస్తోంది. భారత్‌లో పర్యటనకు ఇటీవల వచ్చిన ఓ స్పానిష్ జంట తాము హింసకు గురైనట్లు పోలీస్ కేసు నమోదు చేయడం ఆ మధ్య వైరల్‌గా మారింది. ఇటీవలి కాలంలో దేశంలో మహిళల అక్రమ రవాణా బాగా పెరిగిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. స్త్రీలను మాయమాటలతో, బలవంతంగా ఎత్తుకపోయి విదేశాల్లో అమ్మేయడం, వేశ్యలుగా మార్చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. వాస్తవానికి స్త్రీని గౌరవించే సంప్రదాయం, సంస్కృతిని అనాదిగా పాటిస్తున్న దేశంగా భారత్ తొలినుంచి పేరుగాంచింది. ఇక్కడ మహిళలను తల్లిగా, భార్యగా, అక్కగా, చెల్లిగా అభిమానిస్తారు, గౌరవిస్తారు. అలాగే స్త్రీని శక్తిస్వరూపిణిగా పూజిస్తారు కూడా. అటువంటి వేదభూమిలో ఇప్పుడు ఆడవారికి రక్షణ కొరవడుతోంది. అభం శుభం తెలియని చిన్నపిల్లల నుంచి వృద్ధాప్యంలో ఉన్న మహిళలపైనే కామాంధులు లైంగిక దాడులకు తెగబడుతున్న సంఘటనలు నిత్యం పెద్దసంఖ్యలో వెలుగులోకి వస్తున్నాయి. ఇక దాడులు, హత్యలు, బ్లాక్‌మెయిలింగ్ వంటివి కోకొల్లలు. పోక్సో, దిశ వంటి ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా నేరగాళ్లు తప్పించుకోగలుగుతుండటమే ఈ దుస్థితికి కారణం. దానికితోడు నిందితులను పట్టుకున్నా కూడా కోర్టులు వాదనలు, విచారణల పేరుతో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. దీంతో చాలా మంది బాధితులు సమాజంలో పరువు పోతుందన్న భయంతో బయటకు రావడంలేదు. ఇక భారత్ తర్వాత ఆఫ్ఘనిస్తాన్ మహిళల పరిస్థితి దారుణంగా ఉందని రాయిటర్స్‌ను ఉటంకిస్తూ గూగుల్ వెల్లడించింది. ఈ దేశంలో లైంగిక హింస కంటే ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వేచ్ఛ, బాలికల చదువు విషయంలో తాలిబన్ పాలకులు విధించిన ఆంక్షలు ఈ దేశం మహిళలకు సురక్షితం కాదని చెబుతున్నాయి. మహిళలు లైంగిక, గృహ వేధింపులకు అధికంగా గురవుతున్న దేశంగా సిరియాను పేర్కొన్నారు. మహిళల విషయంలో మధ్య ప్రాచ్య దేశాల్లోనే అత్యంత ప్రమాదకరమైనదిగా సిరియా పేరొందింది. తీవ్రమైన లింగ వివక్ష పాటించే దేశంగా సౌదీ అరేబియా గుర్తింపు పొందింది. పని ప్రదేశాల్లో రక్షణ, ఆస్తి హక్కు వంటి విషయాల్లో ఈ దేశం మహిళలకు సురక్షితం కాదు. ఆర్థిక స్వేచ్ఛ, మహిళల పట్ల వివక్ష విషయంలో పాకిస్థాన్ అగ్రస్థానంలో ఉంది. ఈ దేశంలో మహిళలకు మతపరమైన కట్టుబాట్లు, సంప్రదాయాలు, పరువు హత్యలు పెను సవాల్‌గా మారుతున్నాయి. కక్షపూరితమైన దాడులు, చట్టవిరుద్ధమైన హింసాత్మక కార్యక్రమాలకు నిలయమైన కాంగోలో మహిళలపై వేధింపులు కూడా తీవ్రస్థాయిలోనే ఉన్నాయి. అనేక సంక్షోభాలకు గురవుతున్న యెమెన్‌లో ఆర్థిక, సంస్కృతి, సంప్రదాయ పద్ధతులు మహిళలకు సవాల్‌గా మారుతున్నాయి. నైజీరియాలో ఇస్లామిస్ట్ జీహాదిస్ట్ సంస్థ కారణంగా మహిళలకు రక్షణ కొరవడుతోందని అక్కడి ప్రజలు బలంగా నమ్ముతున్నారు. మహిళలను హింసించడం, అత్యాచారాలకు పాల్పడటం, హత్యలు వంటి అకృత్యాలకు తీవ్రవాదులు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ దేశంలో మహిళల అక్రమ రవాణా కూడా జోరుగానే సాగుతోందని తెలుస్తోంది.

## రాబిన్‌హుడ్ ఆర్మీ సేవలు విస్తృతం కావాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాబిన్ హుడ్ ఆర్మీ సేవలు విస్తృతం కావాలని, లివర్ కాన్సర్ బాధితునికి అండగా రాబిన్ హుడ్ ఆర్మీ నిలవటం హర్షణీయమని ప్రముఖ వైద్యులు, లైన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర బుధవారం అన్నారు. అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్ కుమార్ గత కొంత కాలంగా లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న విషయం విదితమే, వారానికి ఒక ఇంజక్షన్, మూడు నెలలకు 12 తీసుకోవాలి. సుమారు రూ.7,500 ఖర్చుతో తీసుకోవాల్సిన పరిస్థితి, ఎటువంటి ఆధారం లేక ఇబ్బందిపడుతున్న వీరి స్థితిని జేసీ మణిశర్మ, నిరంతర సేవకులు ఉర్లం శివతేజకు తెలపగా, స్పందించిన ఆయన నగరానికి చెందిన డేవిడ్ మాదారపు టీంతో ఇప్పటికి మూడు అందించారు. ఇప్పుడు శ్రీకాకుళం రాబిన్‌హుడ్ ఆర్మీ సహాయంతో, అత్యవసరంగా మూడు ఇంజెక్షన్లను డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ పైడి సింధూర చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సందర్భంగా రాబిన్ హుడ్ ఆర్మీ అధ్యక్షురాలు రేణుక, సభ్యులు నంది ఉమాశంకర్, లైన్స్ క్లబ్ సెంట్రల్ మెంటర్ నటుకుల మోహన్, చైర్‌పర్సన్ ఉర్లం శివ తేజ, సభ్యులు పొడుగు చరణ్, డాక్టర్ పైడి ప్రదీప్, సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు పొడుగు అవినాష్, సేవకులు బొట్టా సాయికుమార్, మదర్స్ ఫౌండేషన్ సుప్రజ రౌత్, ఐవిఆర్ హర్ష, రక్త సేవకులు అల్లాడ నవీన్, అక్షయ సేవా సమితి బొడుగు మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలను అంతమొందించే పాలకుల కుట్రలను ప్రతిఘటిద్దాం



(సత్యంన్యూస్, పలాస)

మధ్యభారత దేశంలో కార్పొరేటీకరణను, సైనికీకరణను శక్తివంతంగా ఎదుర్కొంటున్న ఆదివాసులను చంపేయాలనే దుర్మార్గపు కుట్రలో భాగంగానే ఆపరేషన్ కగార్ అనే అంతిమ యుద్ధాన్ని ఆరెస్సెస్ బీజేపీ పాలకులు నేడు నడుపుతున్నారనీ, ఫాసిజాన్ని, కార్పొరేట్ హిందూ దేశాన్ని స్థాపించాలనే కుట్రలో భాగంగానే విప్లవ చైతన్యాన్ని తుడి చేయాలనే తలంపుతో పాలకులున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర ప్రకాష్ అన్నారు. పీడిత అస్తిత్వ ప్రజలను విముక్తి దిశగా నడిపించే, కార్పొరేటీకరణను సమరశీలంగా ఎదుర్కొనే విప్లవోద్యమాన్ని నిర్మించడం ద్వారానే పాలకుల దుర్మార్గాలను నిలవరించగలమన్నారు. ఆపరేషన్ కగార్' పేరుతో ఆదివాసీలను అంతమొందించే పాలకుల కుట్రలను ప్రతిఘటించాలనీ, విప్లవపోరాట యోధులు కుమరన్న, సీతారాములు 26వ వర్ధంతి సందర్భంగా ప్రతిన బూనుదామన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా తొలిరోజు బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం ఆవరణలో గోడపత్రికను ఆవిష్కరించారు. స్మారక కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజా పోరాటాలు పెల్లుబుకుతున్న వర్తమానంలో లొత్తూరు పంచాయతీలోని ఆదివాసీ గ్రామం పెదగంతరలో అమర వీరులు కుమారన్న, సీతారాముల 26వ స్మారక సభను జరుపుకుంటున్నామని అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన పల్లి కుసుమ మాట్లాడుతూ మతోన్మాద పాలకులు అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యహింస పెరిగిందని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు కార్పొరేట్ దోపిడీకి వంతపాడుతున్న మోదీ పాలనకు వత్తాసు పలకడం శోచనీయమన్నారు. విప్లవ పోరాట యోధులు కుమారన్న & జయక్కల స్మారక కమిటి కార్యదర్శి పోతనపల్లి మల్లేశ్వరరావు (మల్లిబాబు), సభ్యులు, పలు ప్రజా సంఘాల నాయకులు ఆర్.మాధవరావు, బర్ల గోపి, జె. అప్పయ్య, పున్నయ్య, కామేష్, జానకమ్మ, సరస్వతమ్మ, లచ్చుమయ్య, ముఖలింగం, వాసు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అధ్యక్షతన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. 2000 ఆగస్టు 28న బషీర్‌బాగ్ కాల్పుల్లో మృతిచెందిన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు కాంట్రాక్టుల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగిస్తోందని విమర్శించారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కె.మోహనరావు, వీజీకే మూర్తి, కె.శ్రీనివాస్, పి.తేజ, ఎం. మూర్తి, కె.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'అభయం' ఆధ్వర్యంలో రక్తదానం



(సత్యంన్యూస్, టెక్కలి)

కోటబొమ్మాళి మండలం బంజీరుపేట గ్రామానికి చెందిన దేవాది కరువయ్య గత మూడేళ్లుగా పైల్స్‌తో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం క్షీణించి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లగా శరీరంలో రక్తం పూర్తిగా లేదని, అత్యవసరంగా మూడు యూనిట్ల ఏ-పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలని తెలిపారు. రక్తదాతల కోసం తిరిగినా ఎవరూ స్పందించకపోవడంతో టెక్కలి అభయం యువజన సేవా సంఘంను కలిశారు. వెంటనే స్పందించిన సేవా సంఘం జిల్లా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ద్వారా మూడు యూనిట్ల ఏ-పాజిటివ్ బ్లడ్ ఇప్పించారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, జిల్లా హాస్పిటల్ సిబ్బంది డి.శైలజ, శ్రీధర్ పాల్గొన్నారు.

## కండోమ్ కంపెనీపై కేసు



తెలుగు 360 సౌజన్యంతో..

ప్రేక్షకులు కొత్తదనాన్ని కోరుకొంటున్నారు. అది ఏ రూపంలో అందిస్తారన్నది మేకర్స్ చేతుల్లో ఉంటుంది. కొత్త పాయింట్లు ఎత్తుకొంటేే తప్ప తెరపై కొత్త సీన్లు రావు. అందుకోసం పాయింట్ల వేటలో పడ్డారు దర్శకులు. సుహాస్ కొత్త సినిమా 'జనక అయితే గనుక' ట్రైలర్ వచ్చింది. ఆ ట్రైలర్ చూస్తే ఈ టీమ్ కూడా ఏదో ఓ కొత్త పాయింట్ పట్టారన్న నమ్మకం బలంగా కనిపిస్తోంది. ఓ మధ్యతరగతి హీరో. పెళ్లి చేసుకొన్నాడు. పిల్లలు వద్దనుకొన్నాడు. గర్భనిరోధక సాధనాలూ వాడుతున్నాడు. అయితే.. పెళ్లాం అనుకోకుండా నెలతప్పింది. దాంతో.. ఆ కండోమ్ కంపెనీపై భర్త కేసు వేశాడు. ఇదీ కథ. ఫ్యామిలీ డ్రామాతో మొదలైన ఈ కథ, కోర్టు డ్రామాతో ముగుస్తుంది. పాయింట్ పరంగా బాగుంది. వెరైటీ కనిపిస్తోంది. కామెడీకి బోలెడంత స్కోప్ ఉంది. ఎమోషన్ పండించడానికీ ఛాన్సుంది. ఇలా ఈ కథలో అన్ని ఎలిమెంట్స్ పుష్కలంగా కనిపిస్తున్నాయి. దిల్ రాజు బ్యానర్ నుంచి వస్తున్న సినిమా ఇది. కాబట్టి ప్రమోషన్ పరంగా లోటు ఉండదు. మధ్యతరగతి కుర్రాడి పాత్రలో సుహాస్ ఒదిగిపోయాడు. వెన్నెల కిషోర్, గోపరాజు రమణ, రాజేంద్ర ప్రసాద్.. లాంటి నటీనటుల బలం ఈ కథకు ఉంది. సంకీర్తన అనే తెలుగమ్మాయి హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. సందీప్ బండ్ల ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. సెప్టెంబరు 7న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.

## ఆ హీరోపై పిచ్చితో అలాంటి పనికి..!

తెలుగు లైవ్స్ సౌజన్యంతో..



చెన్నై సోయగం త్రిష గురించి పరిచయాలు అవసరం లేదు. ఇటు తెలుగుతో పాటు అటు తమిళంలోనూ భారీ స్టార్డమ్ సంపాదించుకున్న హీరోయిన్ల జాబితాలో త్రిష ఒకరు. పైగా సుధీర్ఘకాలం నుంచి ఈ ముద్దుగుమ్మ హీరోయిన్‌గా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకుపోతోంది. ఒకవైపు హీరోల పక్కన కమర్షియల్ చిత్రాలు చేస్తూనే.. మరోవైపు లేడీ ఓరియెంటెడ్ మూవీస్, వెబ్ సిరీస్‌లలో నటిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా త్రిషకు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట వైరల్‌గా మారింది. ఓ స్టార్ హీరోపై ఉన్న పిచ్చ అభిమానంతోనే కెరీర్‌లోనే తొలిసారి ఐటెం సాంగ్ చేసేందుకు త్రిష ఒప్పుకుందట. ఇంతకీ ఆ హీరో మరెవరో కాదు దళపతి విజయ్. త్వరలోనే విజయ్ గోట్ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) అనే మూవీతో ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. సైన్స్ ఫిక్షన్, దేశభక్తి ప్రధానాంశాలుగా తీసుకుని ప్రముఖ డైరెక్టర్ వెంకట్ ప్రభు ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో తండ్రీకొడుకులుగా విజయ్ ద్విపాత్రాభినయం చేశాడు. మీనాక్షి చౌదరి, స్నేహా, లైలా, ప్రశాంత్, ప్రభు దేవా తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రలను పోషించారు. సెప్టెంబర్ 5న భారీ అంచనాల నడుమ అట్టహాసంగా గోట్ మూవీ విడుదల కాబోతోంది. అయితే ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ ఉంటుందట. ఆ సాంగ్‌లో విజయ్‌తో కలిసి త్రిష ఆడిపాడిందని కోలీవుడ్‌లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఆ సాంగ్‌ను రిలీజ్ చేయనున్నారని కూడా అంటున్నారు. కాగా, తమిళంలో విజయ్-త్రిష హిట్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. వీరు జంటగా నటించిన ఐదు సినిమాలు మంచి విజయం సాధించాయి. ఇప్పుడు ఈ హిట్ సెంటిమెంట్‌ను రిపేట్ చేయడం కోసమే త్రిష చేత స్పెషల్ సాంగ్ చేయించారని, అంతకుగానూ ఆమెకు భారీ మొత్తంలోనూ రెమ్యునరేషన్ ఇచ్చారని వార్తలు వస్తున్నాయి.

## పర్ఫెక్ట్ నడుముతో స్టన్నింగ్ లుక్స్..



తెలుగులో గ్లామరస్ యాంకర్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకున్న ముద్దుగుమ్మ అరియానా గ్లోరి. ఈ అమ్మడు యుట్యూబ్ ఛానల్స్‌లో న్యూస్ యాంకర్‌గా కెరియర్ స్టార్ట్ చేసి ఆ తర్వాత సెలబ్రెటీలని ఇంటర్వ్యూలు చేసింది. అలా రామ్ గోపాల్ వర్మని ఇంటర్వ్యూ చేసి ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. రామ్‌గోపాల్ వర్మ అరియానా అందాన్ని ప్రశంసించడంతో లైమ్‌లైట్‌లోకి వచ్చింది. దాంతో తెలుగు బిగ్ బాస్ షోలో పార్టిసిపేట్ చేసే ఛాన్స్‌ని అరియానా అందుకుంది. రెండుసార్లు బిగ్ బాస్ షో లో పార్టిసిపేట్ చేయడమే కాకుండా దానికి రిలేటెడ్‌గా ప్రసారం అయిన టాక్ షోకి అరియానా హోస్ట్‌గా చేసింది. తద్వారా ఈ బ్యూటీకి తెలుగునాట విశేషమైన ఇమేజ్ వచ్చింది. బుల్లితెర రియాలిటీషోలలో కూడా అరియానా సందడి చేసింది. ఇలా ఈ అమ్మడు సెలబ్రెటీగా స్టార్ యాంకర్‌గా మారిపోయింది. ప్రస్తుతం తెలుగులో ఉన్న హాట్ యాంకర్స్‌లో అరియానా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ని సొంతం చేసుకొని దూసుకుపోతోంది. అడపాదడపా సినిమాల్లో కూడా అరియానా నటిస్తోంది. ఈ ఏడాది అల్లరి నరేష్ హీరోగా వచ్చిన ఆ ఒక్కటి అడక్కు సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్‌లో అరియానా నటించింది. హీరోయిన్ రేంజ్ క్యారెక్టర్ మాత్రం అరియానాకి లభించడం లేదు. కానీ అందంతో హీరోయిన్స్‌కి ఈ అమ్మడు పోటీ ఇస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ రెగ్యులర్‌గా హాట్ ఫోటోషూట్‌లతో సందడి చేస్తూ ఉంటుంది. ట్రెడిషనల్, వెస్ట్రన్ అవుట్ ఫిట్‌లతో అరియానా అందరిని ఎట్రాక్ట్ చేస్తోంది. ఈ అమ్మడు ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతాయి. ఇదిలా ఉంటే తాజాగా అరియానా గ్లోరి నడుము అందాలు చూపిస్తూ బ్లాక్ కలర్ టైట్ ఫిట్ కాస్ట్యూమ్స్‌లో ఉన్న ఫోటోలని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ ఫోటోలకి నెటిజన్ల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. అరియానా అందం వావ్ అనేలా ఉందని ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. అరియనా అందం ముందు ఎవరైనా దిగదుడుపే అంటూ ప్రశంసిస్తున్నారు.

తుపాకీ డాట్ కామ్ సౌజన్యంతో..

# చెత్తను ఎత్తలేక చేతులెత్తేస్తున్నారు!



(మొదటిపేజీ తరువాయి)

ఇందుకు అభ్యంతరం చెప్తోంది. ప్రత్యేకంగా ఈ రెండు మున్సిపాలిటీల్లో ప్రతిరోజు దాదాపుగా వేల మెట్రిక్ టన్నుల చెత్త పోగుపడుతోంది. దానిని ఏమీ చేయలేక ఆ యాజమాన్యం చేతులెత్తేస్తోంది. గుడ్డు పెంకుల నుంచీ జంతు మలం వరకూ ప్రతీదీ పాలిథిన్ బ్యాగుల్లో చుట్టి పడేయడం ఈ దేశస్తులకు ఇప్పటికే ఒక అలవాటుగా మారింది. అరటి తొక్కల నుంచి తినేసిన బిస్కెట్ ప్యాకెట్ కవరు వరకు ప్రతీది ఈ చెత్తలో పోగుపడుతోంది. అయితే ఇదంతా శిథిలమైపోయే చెత్త కదా, ఎందుకు ఆందోళన చెందడం అని మనం అనుకోవచ్చు. చాలా విచిత్రమైన విషయం ఏమంటే, ఇప్పుడు పేరుకుపోతున్న చెత్తలో హానికరమైన విష రసాయనాలు బయట పడుతున్నాయి. ఇది ఏ విధంగా జరుగుతోందో అధికారులకు అంతు చిక్కడం లేదు. ప్రభుత్వం ఎక్కడైనా స్థలం చూపిస్తే అక్కడ చెత్త పోగేయడమే తప్ప, స్థానిక సంస్థల యాజమాన్యాలకు అంతకుమించి ఏమీ చేతకావడం లేదు.

### అతిపెద్ద సమస్య పొరస్పృహ లేకపోవడం

సుప్రీంకోర్టు పరిశీలించిన మరో ఉదాహరణ పేరుకే ఢిల్లీకి పరిమితం. కాని మన దేశంలో కనీసం పాతిక చోట్ల ఇవే పరిస్థితులు దాపురించినట్లు ఎన్జీటీ ఫిర్యాదు చేస్తోంది. ఢిల్లీకి కూతవేటు దూరంలో దగ్గరలో భాల్సువా డైరీ సిటీ ఉంది. సుమారు యాభై ఏళ్ల కింద పాడి పరిశ్రమను పెంపొందించే ఉద్దేశంతో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ బాల్స్ ఈ ప్రాంతంలో ఒక డైరీ సిటీని రూపొందించింది. పెద్ద కాలనీని డిజైన్ చేసి, తానే గృహాలు రూపొందించి, పశువులు అత్యధిక సబ్సిడీతో అందజేసింది. తాను అనుకున్న ప్రకారం పట్టణానికి పాలు సరఫరాచేసే కేంద్రంగా రూపొందించారు. కాని, మూడు దశాబ్దాల కిందట నగరంలో పోగు పడుతోన్న చెత్తను డంప్ చేయడానికి వీలుగా ఈ డైరీ సిటీకి ఆమడ దూరంలో ఇంకొక స్థలాన్ని ఇచ్చారు. ఈ మూడు దశాబ్దాల్లో ఆ చెత్త క్రమక్రమంగా పెరుగుతూ ఒక పెద్ద కొండ మాదిరిగా తయారయింది. దాని చుట్టుపక్కల ఎవరూ ఉండలేని దుర్గంధం దాపురించింది. ఇప్పుడు ఆ కాలనీవాసులు తమ ఆరోగ్యం రోజురోజుకు దిగజారుతోందని రోడ్డెక్కుతున్నారు. వెంటనే డంప్ యార్డును తరలించమని ఢిల్లీ ప్రభుత్వానికి వినతులు పెడుతున్నారు. స్థానికులు తమ ఆరోగ్యాలు పణంగా పెట్టలేమని, వెంటనే డంపు యార్డును తరలించాలని కోరుతుంటే, ప్రభుత్వమేమో డంపు



యార్డుకు దగ్గరలో కాలనీవాసులను తరలించాలని, వారికి పునరావాసం కల్పించాలని ప్రయత్నాలు ప్రారంభించింది.



మేఘాలయలో వుంకేన్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న దాదాపు 12 గ్రామాలు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన గళం విప్పాయి. దానికి కారణం ఈస్ట్ కాశీ హిల్స్ జిల్లాలో వుంకేన్ నదిని అనుకున్న ప్రదేశాన్ని ప్రభుత్వం డంపింగ్ యార్డుగా ఎంపిక చేయడమే. ఈ చెత్త కొన్ని ఏళ్లకే పేరుకుపోయి, మొత్తం నదిని కలుషితం చేస్తుందని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. వారికి ఆ నదీజలమే తాగునీటి ఆధారం. 2023లో రెండు వారాలపాటు జరిగిన కన్వర్ యాత్రలో హరిద్వార్ ప్రాంతంలో 30వేల మెట్రిక్ టన్నుల నాన్ బయో డిగ్రేడబుల్ చెత్త పోగయింది. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ప్రాంతం ఏదైనా సమస్య ఒకటే. చెత్తను మేనేజ్ చేయలేక ప్రభుత్వాలు చతికిలపడడమే.

### ఆలోచన ధోరణి మారనంతవరకూ ఇంతే!

మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మైదాన ప్రాంతంలో చెత్త పోగేయడం ఒక సాధారణ అంశం. ఈ ఓపెన్ ఫీల్డుల నుంచి దుర్గంధం వెలువడటం, కొన్నిసార్లు చెత్త అగ్నికి ఆహుతి కావడం, అప్పుడు వెలువడే వాయువులు ప్రమాదకరంగా పరిణమించడం రివాజుగా మారింది. దీనికి కారణం ఇది తనంతట తాను శిథిలమయ్యే (డిగ్రేడబుల్) చెత్త కాకపోవడమే. దేశ రాజధానిలో ఉన్న డంపుయార్డుల్లో చెత్తను పరిశీలించిన పొల్యూషన్ బోర్డు శాస్త్రవేత్తలు వాటిలో కలిసివున్న ప్రమాదకర రసాయనాలను చూసి విస్మయం చెందుతున్నారు. మనదేశంలో స్థానిక సంస్థల యాజమాన్యాలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించక, తాత్కాలిక పరిష్కారాలతో పొద్దు పుచ్చుతున్నారు. సమస్య పరిష్కారానికి కేటాయించిన నిధులు కూడా దుర్వినియోగం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు బదిలీలపై పోవడం, మనకు చిత్తశుద్ధి లేకపోవడమే దీనికి కారణాలు. ఈ చెత్త సమస్యను శాశ్వతంగా పరిష్కరించే పనిముట్లు గాని, అంత సాంకేతికత గాని, దానికి సరిపడా సిబ్బంది గాని మన వద్ద లేకపోవడం కూడా ఒక వాస్తవమే. ఇలా పేరుకు పోతున్న చెత్త నుంచి వెలువడుతున్న భయంకర రసాయన విష వాయువులు అక్కడ నేల నుంచి దగ్గర్లో ఉండే జలవనరులలో కలిసిపోతున్నాయి. ఇది మరింత ప్రమాదకరమైన పరిస్థితికి దారితీస్తోంది. ఆ జలావాసాల్లో పెరిగిన చేపల్ని వినియోగించినవారు పలు రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్జీటీ ఓపెన్ ప్లాట్స్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను పోగేయవద్దని కోరుతోంది. మరి అభివృద్ధి చెందిన దేశాలు ఈ విషయంలో ఏం చేస్తున్నాయని తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చెత్త సమస్యను వారు పరిష్కరించారు. దానికి సాంకేతికత సహాయం తీసుకున్నారు. ప్రపంచంలో ఈ విషయంలో స్వీడన్ అగ్రస్థానంలో ఉంది. ఇప్పుడు స్వీడన్ తన పొరుగు దేశాల నుంచి చెత్తను కొంటున్నది. ఎందుకంటే దానినుంచి అంత లాభం సంపాదిస్తోంది. మీథేన్ హార్వేస్ట్



చేయడం, విద్యుత్ ఉత్పత్తి జరపడం, మెటీరియల్ రికవరీ సెంటర్స్ ఏర్పాటు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని వారు చెప్తున్నారు. స్వీడన్ చెత్త నుంచి సంపద సృష్టిస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో పోగుపడుతున్న చెత్తను సమర్థంగా వినియోగించుకోవడానికి మరిడి లాంటి కొన్ని సంస్థలు కొంతమేర ప్రయత్నిస్తున్నాయి. చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే యంత్రాంగం మనం రూపొందించగలిగితే, స్థానిక సంస్థలు పెద్ద ఎత్తున సంపద సృష్టించగలుగుతాయి. ఎక్కడా చెత్త దుర్వినియోగం కాదు. స్థానిక సంస్థలు ఆర్థికంగా పరిపుష్టం కాగలుగుతాయి.

**రోడ్లు ఊడ్చడం నుంచి చెత్త ఎత్తడం వరకు ఇదంతా దళితుల పనిగా మన దేశం భావిస్తోంది. అందువల్లనే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నాం. ఇంతవరకూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటుకు మనకు ఒక వ్యవస్థ లేకపోవడం శోచనీయం. పేరుకే వంద స్మార్ట్ సిటీలు ప్రకటించుకున్నాం. చెత్త గురించి ఆలోచించలేకపోతున్నాం.**

## ఎస్టీ మాకివలస ఆదివాసీలకు అండగా ఉంటాం

**- రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్య శంకర్ నాయక్ -**



(సత్యంన్యూస్, నరసన్నపేట)

జలుమూరు మండలం మర్రివలస పంచాయతీ పరిధిలో ఎస్టీ మాకివలస గిరిజన సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర నాయక్ అన్నారు. మంగళ వారం ఎస్టీ మాకివలసలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల జోలికిస్తే సహించేది లేదన్నారు. ఆదివాసీ హక్కులకు భంగం కలిగించేలా హరేరామ హరేకృష్ణ సంస్థ వ్యవహ రించడం సరికాదని, పేర్కొన్నారు. ఇంటి మధ్యలో రాళ్లు పాతడం స్థానిక ఆదివాసీలు శంకర్ నాయక్ చూపించి కన్నీటి పర్యంతమ య్యారు. స్థానికులు మాట్లాడుతూ కనీస వసతులైన తాగునీరు, సీసీ రోడ్లు, ఇళ్లు లేక ఎవరైనా మరణిస్తే కనీసం స్మశానవాటిక లేకుండా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఆదివాసీ సంక్షేమ పరిస్థితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి మాట్లాడుతూ నాలుగు తరాలుగా సాగుచేస్తున్న వ్యవసాయ పొలాలను అన్యాయంగా వేరొకరు అమ్మ కాలు చేయడంతో ఇక్కడ ఆదివాసీలు జీవనాధారం కోల్పోతున్నట్లు తెలిపారు. రెవిన్యూ శాఖ సంబంధించిన భూములపై ఇక్కడ వివాదం నడుస్తూ ఉంటే ఆ శాఖ తహసీల్దార్ టీటీఆర్ఐలో హాజరు కాకపోవడంపై వడిత్య శంకర్ నాయక్ అసహనం వ్యక్తం చేశారు. ముందుగా జలుమూరు తహసీల్దార్ లక్ష్మీనారాయణతో ఫోన్లో మాట్లాడగా కోర్టు పనివల్ల హాజరు కాలేదని వివరించారు. కనీసం డీడీఆర్ఐ స్థాయి అధికారులు హాజరై భూముల వివరాలు చెప్పా ల్సిన బాధ్యత లేదా అని మండిపడ్డారు. అనంతరం పలువురు గిరి జనులు కమిషన్ సభ్యులకు వినతులు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఉమహేశ్వరరావు, జలుమూరి ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరంతర రక్త శ్రామికుడు నవీన్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిరంతర రక్త శ్రామికుడు అల్లాడ నవీన్ అని, నగరంలో ఎస్డీపీ కావాలంటే ముందుంటారని ప్రముఖ వైద్యులు లైన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర అన్నారు. నగరంలో రోజూ సుమారు 10 సింగల్ డోనర్ ప్లేటిలెట్స్ అవసరమ వుతాయని, సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఎస్డీపీ డోనర్స్ పెరిగే అవకాశ ముందన్నారు. స్ఫూర్తిప్రదాత నవీన్ రక్తదాతగా మారటమే కాకుండా, తన మిత్ర బృందంతో ప్రతీరోజు రక్తదాతలను, ఎస్డీపీ డోనార్స్‌ను మోటివేట్ చేస్తూ ప్రాణాలు కాపాడటంలో భాగమౌతుండటం హర్షణీ యమన్నారు. నవీన్ సేవలను గుర్తిస్తూ లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ తరఫున బుధవారం సింధూర హాస్పిటల్‌లో ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి దుస్సాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సెంట్రల్ మెంటర్ నటుకుల మోహన్, మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, సభ్యులు పొడుగు చరణ్, డాక్టర్ పైడి ప్రదీప్, సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు పొడుగు అవినాష్, సేవకులు బొట్టా సాయికుమార్, మదర్స్ ఫౌండేషన్ సుప్రజ రౌత్, ఐవిఆర్ హర్ష, అక్షయ సేవాసమితి బొడుగు మధు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర పోలీస్ శాఖలో వండర్.. ఏఐ మార్వెల్!

(మొదటిపేజీ తరువాయి)

రూరల్ ఎస్పీ, మార్వెల్ ఎక్స్-అఫీషియో డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హర్ష్ పొద్దార్. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయా లన్నట్టుగా టెక్నాలజీ అధికమవుతున్నకొద్దీ నేరాల సంఖ్య పెరగడం కూడా ఈ సమాజానికీ, ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీస్ కూ అర్థం కాని పెద్ద ప్రశ్నగా తయారైంది. అయితే, ఇవాళ పెద్ద పెద్ద నగరాల నుంచి చిన్న మారుమూల గ్రామాల వరకూ సీసీ కెమెరాలు, మొబైల్ ఫోన్స్ రీచ్ అయిన పరిస్థితుల్లో వాటిల్లో నిక్షిప్తమయ్యే ఏ చిన్న డాటా అయినా సరే.. ఏఐలోని అల్గారిథమ్స్ నేరం జరిగినప్పుడు కచ్చితమైన అంచనా వేయడానికి ఉపయోగపడతాయంటున్నారు నాగపూర్ పోలీ సులు. చైన్ స్నాచింగ్ కేసులు వేల సంఖ్యలో జరుగుతున్న క్రమంలో సీసీ కెమెరాల్లో రికార్డయ్యే బైక్స్, వాటి వేగం, నేరస్థుడు ఆ బైక్‌పై వచ్చినప్పుడు ఉపయోగించిన హెల్మెట్ రకం వంటివన్నీ ఏఐ ఆక్యు రేట్‌గా డీకోడ్ చేయగల్గుతుందంటున్నారు.

మహారాష్ట్రతో పాటు ఇప్పటికే ఇతర రాష్ట్రాలు కూడా ఏఐని విని యోగంలోకి తీసుకురావడానికి పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తూనే ఉన్నా.. మహారాష్ట్ర మాత్రం ఏకంగా మార్వెల్ వంటి ఓ స్పెషల్ డ్రైవ్ వెహికల్‌నే ఏర్పాటుచేసి ఒక్క అడుగు ముందులో ఉందనేది మాత్రం అక్కడ జరుగుతున్న ఎక్సర్‌సైజును బట్టి అర్థం చేసుకోవచ్చు. అయితే ఏఐ ఏవో కొన్ని నిర్ధిష్టమైన కేసులకే పరిమితం కాదని.. సందర్భాన్నీ, కేసు అవసరాన్ని బట్టి పోలీస్ శాఖ గొడుగు కింద ఉండే ఏజెన్సీలు ఏఐని ఉపయోగించుకునేలా ఈ స్పెషల్ డ్రైవ్ వెహికిల్ పని చేస్తుం దంటోంది మహారాష్ట్ర పోలీస్ విభాగం.

**మరి ఏఐ సంక్లిష్టమైన నేరాలను ఎలా పరిష్కరించగలదు..?**

మార్వెల్ స్పెషల్ పర్పస్ వెహికిల్ వేర్వేరు ఏజెన్సీల కోసం పని చేస్తుండగా.. ఇప్పటికే ఇందుకోసం మహారాష్ట్ర ప్రభుత్వం 25 మంది నిష్ణాతులైన, నైపుణ్యమున్న నిపుణులను ఏర్పాటు చేసుకుంది. ఒక నేరం ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? చేసిన వ్యక్తులు ఏవిధంగా ఆ సదరు నేరానికి రూపకల్పన చేశారనే పలు అంశాలపై ఒక ప్రిడి క్షన్‌తో కూడిన అంచనాను ఏఐ ఏజెన్సీల ముందు పెడుతుంది. దాన్ని డీకోడ్ చేస్తూ అర్థం చేసుకుని.. ఆ ట్రెండ్‌ను బట్టి పరిశోధన కొనసా గితే పెద్ద పెద్ద క్రైమ్ కేసులు కూడా సులభంగా పరిష్కరించే అవకాశ ముంటుంది. ఇప్పటికే నాగపూర్ పోలీస్ శాఖ తప్పిపోయిన మహిళ లు, పిల్లలకు సంబంధించిన కేసుల్లో ఏఐ మద్దతుతో సత్ఫలితాలు సాధిస్తోంది.

ఎందుకంటే నాగపూర్ వంటి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు ఈ ఏఐ పరిశోధనను మరింత సులభతరం చేస్తోంది. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు లేకపోవడమో, పని చేయకపోవ డమో జరిగితే యాక్సిడెంట్స్‌కు పాల్పడి ఆపకుండా వేగంగా వెళ్లి పోయే వాహనాలను గుర్తించే క్రమంలో హిట్ అండ్ రన్ కేసుల్లో టోల్‌ప్లాజాల్లో సీసీ ఫుటేజీని స్కాన్ చేయడం ద్వారా అనుమానిత వాహనాలను సులభంగా గుర్తించడంలో కూడా ఈ ఏఐ మంచి ఫలి తాలనిస్తోంది. ఎందుకంటే, రోజూ ఒక హైవేపై ఎన్నో వాహనాలు వెళ్తుంటాయి. కానీ, నేరానికి పాల్పడ్డవారు కాసింత ఆదరాబాదరాగా ఉండే సమయంలో వడివడిగా బయటపడాలని చూస్తున్నప్పుడు.. ఆ వేగంగా వెళ్లే పరిమితితో కూడుకున్న వాహనాలు కొన్నే కనిపిస్తుండ వచ్చు. వాటిని ట్రేస్ చేస్తే పరిశోధన సులభతరమైపోతుంది.

గతంలో ఉడ్తా పంజాబ్ అని మాత్రమే పిల్చుకునే చోట.. దేశ మంతా మాదక ద్రవ్యాల వినియోగం విచ్చలవిడి చలామణి అవుతూ ఉడ్తా భారత్‌గా మారుతోంది. ఈ క్రమంలో ఏఐ ఉపయోగం మాదక ద్రవ్యాల కేసుల్లోనూ, అలాగే మానవ అక్రమరవాణా కేసుల్లోనూ కీల కంగా మారుతోంది. డాటాబేస్ పెద్దఎత్తున తయారైన క్రమంలో ఫోకస్డ్‌గా పరిమితమైన సమాచారంపై మాత్రమే ఇన్వెస్టిగేటివ్ ఆఫీ సర్స్ దృష్టి సారించేందుకు వడబోతలో కూడా ఏఐది కీలకపాత్ర.

అయితే, డాటా అంచనాలో కచ్చితత్వం కోసం, కేవలం ఏఐపైనే పూర్తిగా ఆధారపడకపోయినా పరిశోధనలో భాగంగా క్రాస్‌చెక్ చేసుకోవడానికి, మరింత సమర్థవంతంగా పని చేయడానికి మాత్రం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఓ మార్వెల్. మరి ఈ మార్వెల్ ఇప్పుడు పోలీసులతో చేతులు కలిపి శాంతిభద్రతల పరిరక్షణలో భాగం కావడం సాంకేతికత సాధించిన మరో అద్భుత విజయం.

## ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో బాధ్యతలు చేపట్టిన కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, నరసన్నపేట పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్, సారవకోట పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.అనిల్‌కుమార్, మందస పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె.ఖాదర్ భాష, ఇచ్ఛాపురం రూరల్ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, బూర్జ పోలీసు స్టేషన్



సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవల్లిక జిల్లా పోలీసు కార్యాలయం లో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల వారికి ఎస్పీ దిశా నిర్దేశం చేశారు.





శ్రీకాకుళం టౌన్ సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా సీహెచ్ వివే కానంద మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. అనంత రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ స్టేషన్ల నిర్వహణ, పర్యవేక్షణ తదితర అంశాలపై డీఎస్పీతో ఎస్పీ చర్చించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

ఎం.ఇమ్రాన్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLiSc, B.SC (all groups),
BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA,
M. SC (All Subjects), MLiSc, M.Tech
Computer Applications, Cyber Security. Digital Marketing.
Hospital Management, Tourism Management

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# సీజనల్ జ్వరాలు

**కిక్కిరిసిపోతున్న ప్రభుత్వాసుపత్రులు**

**ల్యాబ్‌లో పరికరాలు లేక ప్రైవేటు వైపు పరుగులు**



(సత్యంన్యూస్, కొత్తూరు)

సీజనల్ జ్వరాల కారణంగా కొత్తూరు సామాజిక ఆసుపత్రి రోగులతో కిక్కిరిసిపోతుంది. రోగులకు సరిపడినన్ని ఫ్యాన్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేక ప్రభుత్వాసుపత్రులకు వెళ్లడంతో రోజుకు 200 వరకు ఓపీ ఉంటోంది. అయినా కనీస అవసరమైన ఎక్స్‌రే మిషన్ వంటి కనీస పరికరాలు లేకపోవడం శోచనీయం. దీంతో వీరు మళ్లీ ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సివస్తోంది. అసలే పేదరికం, అందులోనూ విషజ్వరాల సీజన్ డబ్బులు వదిలించుకోలేక, ప్రాణాలు అరచేత పట్టుకొని అప్పులు వాడి మరీ ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ల్యాబ్‌లో పరికరాలు, ఆసుపత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.






# జిల్లాలో ఎరువుల కొరత ఉంది

- అధికారులు వాస్తవాలను తొక్కిపెడుతున్నారు
- ఎమ్మెల్యే కూన రవికుమార్
- హౌసింగ్ డీఈకి పది బాధ్యతలు అప్పగించడంపై ఆగ్రహం






(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఎరువులు కొరత ఉందని ప్రభుత్వం ద్వారా ఒప్పుకుంటున్నామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. జెడ్పీ చైర్‌పెర్సన్ పిరియా విజయ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో రవికుమార్ మాట్లాడారు. జిల్లాలో ఎరువుల డిమాండ్‌కు తగినట్టు సరఫరా లేకపోవడం వల్ల కొరత తీవ్రంగా ఉందని, దీనికి వ్యవసాయ శాఖ అధికారుల అవగాహన రాహిత్యమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకు అవసరమైన ఎరువులు నిల్వ చేయడం, ఇండెంట్ పెట్టి దిగుమతి చేసుకోవడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు పూర్తయినా రైతులకు ఎరువులు అందుబాటులో లేవన్నారు. వాస్తవాలను దాచిపెట్టి సభలో అధికారులు అబద్ధాలను చెప్పే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎరువుల కొరతకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లోనే ఎరువులు అందుబాటులో ఉంచి డీసీఎంఎస్, పీఏసీఎస్, మహిళా సమాఖ్యల ద్వారా ఎరువుల సరఫరాకు ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వ్యవసాయశాఖ జేడీ స్పందిస్తూ గత ఖరీఫ్‌తో పోల్చితే ఈ ఏడాది ఎరువుల సరఫరా గణనీయంగా తగ్గిందని వివరించారు. జిల్లాకు వచ్చే ఎరువుల్లో 50 శాతం ప్రైవేట్‌కు, మిగతా 50 శాతం రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం మాట్లాడుతూ ఎరువులు ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టి రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఎరువులతో పాటు పురుగు మందులు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు.

**ఒక్కరికి పది బాధ్యతలా?**

హౌసింగ్ డీఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న అప్పారావుకు అదనపు బాధ్యతలు, ఇన్‌ఛార్జిగా ఆ శాఖలో వివిధ విభాగాల్లో పది కీలకమైన పోస్టుల్లో కొనసాగిస్తుండటాన్ని ప్రస్తావించారు. ఇదే పద్ధతిలో జలవనరుల శాఖలో ఇంజినీర్లు ఇఎఫ్ఏసీ, ఇన్‌ఛార్జిలుగా ఏళ్లతరబడి కొనసాగుతున్నారన్నారు. జలవనరుల శాఖలో జోన్-1లో అర్హులైన ఇంజినీర్లు దశాబ్దాల తరబడి ఉద్యోగోన్నతికి నోచుకోవడం లేదని, దీనికి జోన్-5 నుంచి జిల్లాకు వచ్చిన ఇంజినీర్లే కారణమన్నారు. ప్రమోషన్లలో అన్యాయానికి గురైన ఇంజినీర్లను గుర్తించి న్యాయం చేయడానికి సభలో తీర్మానం ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. దీన్ని సభ్యులంతా ఆమోదించాలని కోరారు. నీటిపారుదల కాలువల నిర్వహణ గాలికొదిలేశారన్నారు. ప్రత్యేక నిధులు మంజూరుచేసి అవసరమైన చోట కాలువల్లో గుర్రపుడెక్కలు తొలగించే చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

**టీడీపీ మద్దతుదార్లకే ఎరువులు**

టీడీపీ మద్దతుదార్లకే ఎరువులు సరఫరా చేశారని నందిగాం ఎంపీపీ నడుపూరి శ్రీరామూర్తి సమావేశంలో లేవనెత్తారు. నందిగాం మండలంలో టీడీపీ నాయకుల సిఫార్స్‌తో ఆ పార్టీ మద్దతుదార్లకే ఎరువులు పంపిణీ చేసి మిగతా రైతుల పట్ల వివక్ష చూపించారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వ్యవసాయ శాఖ మంత్రి కలిగిన జిల్లాలో ఎరువుల కొరత ఉండడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సైలాడ గ్రామంలో ఎరువుల కోసం వ్యవసాయ అధికారిపై దాడికి దిగారని వివరించారు. వైకాపా హయాంలో ఆర్‌బీకేలో పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ ఎరువులు సకాలంలో సరఫరా చేశారని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా ఎరువులు పంపిణీ చేసేందుకు కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వైకాపా హయాంలో వాలంటీర్ల ద్వారా పార్టీ మద్దతుదార్లకే ఎరువుల పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. దీంతో వైకాపాకు చెందిన పలువురు ఎంపీపీ, జెడ్పీటీసీలు ఎమ్మెల్యే శంకర్‌తో వాగ్వాదానికి దిగారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కూన రవికుమార్ జిల్లాలో ఎరువుల కొరత ఉందని తామంతా అంగీకరిస్తున్నామని, సభ్యులంతా గౌరవసభలో రాజకీయాలకు అతీతంగా సమస్యలపై మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీంతో సభ్యులంతా శాంతించారు.

**అక్రమ రొయ్యల చెరువులు తొలగించాలి**

శ్రీకాకుళం రూరల్ మండలంలో అక్రమంగా తవ్విన రొయ్యల చెరువులను తొలగించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. సముద్రంలో కలిసే ప్రాంతానికి కొన్ని మీటర్ల దూరంలో నాగావళి నదీ ప్రవాహం దిశ మార్చుకోవడానికి రొయ్యల చెరువులే కారణమన్నారు. దీనివల్ల సమీపంలో ఉన్న గ్రామాలు కోతకు గురై నదీగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. పూర్తి కాలం పనిచేసే పద్ధతిలో లష్కర్లను నియమించాలని కోరారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ వంశధార ఎడమ కాలువ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గం పరిధిలో వంశధార ఎడమకాలువపై నిర్మాణం చేసిన వంతెనలు శిథిలావస్థకు చేరాయని, వీటి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశానికి పలువురు సభ్యులు గైర్హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# సుందర శ్రీకాకుళం నిర్మిద్దాం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుందర శ్రీకాకుళం నిర్మాణంలో ప్రతిఒక్కరం భాగస్వామ్యం అవుదామని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బలగ, ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, మేజర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానికుల కోరిక మేరకు మేజర్ కాలనీలో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని తెలిపారు. అనేక డివిజన్లో కనీసం మౌలిక సదుపాయాలు కూడా నోచుకోక ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజలు తనను ఏ నమ్మకంతో గెలిపించారో వారికి అన్ని విధాల సౌకర్యాలు కల్పించి వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఇప్పటికే నగరంలోని అన్ని డివిజన్లలో కాలువల్లోని పూడిక తీయిస్తున్నట్టు చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలతున్న దృష్ట్యా మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండి సకాలంలో కాలువలను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గబ్బర్ అందరిలో స్ఫూర్తి నింపారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాయితి చంద్రశేఖర్ అందరిలో స్ఫూర్తి నింపారని, తలసేమియా పిల్లల కోసం, అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల అవసరాలకు ముందుచూపుతో చంద్రశేఖర్(గబ్బర్) తలపెట్టిన ఈ మహత్తర కార్యక్రమం అభినందనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. బుధవారం గబ్బర్ (రాయితి చంద్రశేఖర్) జన్మదినాన్ని పురస్కరించుకొని గబ్బర్ అభిమానులు, మిత్ర బృందం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ గబ్బర్‌ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ గబ్బర్‌లా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చెయ్యాలని పిలుపునిచ్చారు. అనంతరం గబ్బర్ అభిమానులకు, రక్తదాతలకు, మిత్ర బృందానికి రెడ్‌క్రాస్ ద్వారా జ్ఞాపికను, ప్రశంసా పత్రాలను అందించి దుస్సాలువలతో సత్కరించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో రక్తదాన శిబిరం ముఖ్య నిర్వాహకులు పూతి భాస్కర్ రావు, కుంగ్‌ఫూ శేఖర్, రాయితి శ్రీనివాస్, అమ్మ దాబా కృష్ణ, సందీప్, సిద్దు, రాజా, మూర్తి, లోకేష్, శ్రీను, సుధీర్, మని, శేఖర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ముహూర్తం ఖరారు

- 8న కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ మీట్
- ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా పోటీలు
- ఇక్కడ రాణించిన అథ్లెట్స్‌కు రాష్ట్ర పోటీల్లో పాల్గొనే అవకాశం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ప్రతి ఏటా జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలకు రంగం సిద్ధమౌతుంది. షెడ్యూల్‌ను నిర్వాహకులు ఖరారు చేశారు. కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ పోటీలు సెప్టెంబర్ 8న నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు కొన్న వెంకటేశ్వరరావు(వాసు), కొన్న మధుసూదనరావు, ప్రగడ అశోక్ కుమార్, పూడి బాలాదిత్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు జరగనున్నట్టు వారు చెప్పారు. గత 16 ఏళ్ల నుంచి కొన్న చిన్నారావు కుటుంబ సభ్యులు లక్షలాది రూపాయలను వెచ్చించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిఏట క్రీడాపోటీలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

**నాలుగు వయో విభాగాల్లో పోరు..**

సెప్టెంబర్ 8న జరిగే కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు మొత్తం నాలుగు వయో విభాగాల్లో నిర్వహించనున్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా 100 మీటర్లు, 400, 800, 2వేలు, 3వేలు, 5వేల మీటర్ల పరుగు పందాలు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో తదితర కేటగిరిల్లో పోటీలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల్లో విజేతలగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రసంశా పత్రాలను అందజేయనున్నారు. ఇక్కడ రాణించిన క్రీడాకారులను సెప్టెంబర్ 14 నుంచి 16 వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడామైదానం వేదికగా జరిగే స్వర్గీయ కొన్న చిన్నారావు ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నారు. గుంటూరులో జరగనున్న రాష్ట్రపోటీలను కూడా కొన్న చిన్నారావు మెమోరియల్ పేరిట ఆయన కుమారుడు కొన్న వెంకటేశ్వరరావు(వాసు) నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎంతో పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, జిల్లా చైర్మన్ కొన్న వాసు నేతృత్వంలో గత 16 ఏళ్ల కాలంగా ప్రతి ఏటా క్రీడాపోటీలను నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిన్నారు.

# నేత్రదానంపై అవగాహన ర్యాలీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు నేత్ర దానంపై అవగాహన కల్పించారు. నేత్రదాన అవశ్యకతను, కార్నియల్ అంధత్వానికి ప్రధాన కారణాలు, ఏ వయసు వారు నేత్రదానం చేయవచ్చు, ఎవరిని సంప్రదించాలనే అంశాలను వివరించారు. నేత్రదానం గొప్ప దానమని, మనిషి మరణించాక కూడా తన కళ్లు లోకాన్ని చూడగల అద్భుతం నేత్రదానం ద్వారానే జరుగుతుందన్నారు. దెబ్బతిన్న కార్నియాను ఆరోగ్యకరమైన మానవుని కార్నియాతో భర్తీ చేయడం ద్వారా కార్నియల్ అంధత్వంను తగ్గించవచ్చని రెడ్‌క్రాస్ ఐ-టెక్నీషియన్ పి.సుజాత తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నేత్రదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఏవో నర్సింగరావు, మేనేజర్ వివిఎస్ఆర్ఎల్ గుణకర్‌రావు, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, రెడ్‌క్రాస్ పీఆర్వో పి.చైతన్యకుమార్, అకౌంట్స్ మేనేజర్ బి.సతీష్. ఏపీ ఆర్వో ఉమాశంకర్, జగదీష్, వెంకటరమణ, కో-ఆర్డినేటర్ ఉర్లం శివతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# భార్యపై కత్తితో భర్త దాడి

## రిమ్స్‌లో చికిత్స.. పరారీలో నిందితుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

గార మండలం బందరువానిపేట గ్రామానికి చెందిన రాయితి అమ్మోరుపై భర్త రామారావు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి కథనం ప్రకారం భర్త రామారావు సిమ్యాన్‌గా పనిచేస్తూ గడిచిన పదేళ్లుగా ఇంటి వద్దనే ఉంటున్నారని తెలిపింది. నిందితుడు రామారావుకు ఇద్దరు భార్యలని, మొదటి భార్య అయిన తాను బందరువానిపేటలో రామారావుతో కలిసి ఉంటున్నట్లు బాధితురాలు అమ్మోరు తెలిపింది. రెండో భార్య ఇప్పిలి గ్రామంలో నివాసం ఉంటోందని, మద్యానికి బానిసైన రామారావు మొదటి భార్య తనతో నిత్యం గొడవపడుతూ ఉండేవాడని, తనకు సంతానం లేకపోవడంతో దగ్గర బంధువుల్లో ఒకరిని దత్తత తీసుకొని పెంచుకున్నామని, ప్రస్తుతం ఆ అబ్బాయి వివాహం చేసుకొని వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నారని బాధితురాలు అమ్మోరు తెలిపింది. తాను బయట ఇళ్లల్లో పనిచేస్తూ జీవిస్తున్నానని, తన భర్త రామారావు మద్యంకు డబ్బులు ఇవ్వమని నిత్యం వేధించేవాడని, తన వద్ద డబ్బులు లేవన్నా వినేవాడు కాదని, ఎప్పుడూ మద్యం సేవించి కొట్టేవాడని బాధితురాలు తెలిపింది. మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడని, భోజనం పెట్టే సమయంలో తనతో గొడవకు దిగి ఆయన వెంట తెచ్చుకున్న కత్తితో ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడని బాధితురాలు తెలిపింది. బాధితురాలి బంధువులు గార మండల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, గార ఎస్సై దర్యాప్తు చేశారు. ప్రస్తుతం నిందితుడు రామారావు పరారీలో ఉన్నట్లు గుర్తించారు. బాధితురాలు తీవ్రగాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతోంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.